సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో నిత్యాన్నదానం ట్రస్టుకు శ్రీరామచంద్రమూర్తి, నాగమణి దంపతులు (పి.గన్నవరం) రూ.50,116 విరాళం అందించారు.



'ఈనాడు' రాతలపై ఆగ్రహ జ్వాలలు

రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపైనా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైనా తప్పుడు రాతలు రాస్తున్నారంటూ 'ఈనాడు' దినపత్రిక ప్రతులను వైఎస్సార్ సీపీ నేతలు దహనం చేశారు. - 8లో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఈశ్వరరావు భార్య ఈశ్వరికి చెక్కు అందజేస్తున్న ఏఎస్పీలు రజనీ, వెంకటేశ్వరరావు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఈశ్వరరావు కుటుంబానికి ఆదరణ పథకం ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్పీలు ఎం.రజనీ, జి.వెంకటేశ్వరరావు ఈ మొత్తాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ఈశ్వరరావు భార్య ఎస్.ఈశ్వరికి గురువారం అందజేశారు. ఈశ్వరరావు గతనెలలో మృతి చెందారు. దీంతో ఆదరణ పథకం ద్వారా రావాల్సిన రూ.లక్ష, కార్పస్ ఫండ్ బాడీ ద్వారా రూ.50 వేలు కూడా కలిపి రూ.1.50 లక్షలు ఆమెకు అందజేశారు.

నాటు తుపాకీ కలిగిన ఇద్దరు అరెస్టు

జగ్గంపేట: మండలంలోని గోవిందపురం గ్రామ శివారు కొండుపోడు భూముల వద్ద లైసెన్సు లేకుండా నాటు తుపాకీ కలిగిన ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. గోవిందపురం గ్రామానికి చెందిన మానేపల్లి నూకరాజు, సీంబోతుల పత్తియ్య వద్ద లైసెన్స్ లేని తుపాకీ ఉందన్నారు. దీంతో వారిని అరెస్టు చేశామన్నారు. వీరు పిట్టల కొట్టి జీవిస్తున్నారని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు చెప్పారు.

భూ సర్వేలో అభ్యంతరాలు ఉంటే చెప్పండి

జిల్లా దేవదాయశాఖ అధికారి నారాయణమూర్తి

బోట్‌క్లబ్: జగనన్న భూ సర్వేలో ఆయా దేవాలయాలు, సత్రాలకు సంబంధించిన భూమి కంటే తక్కువ భూమి ఆయా సర్వే నంబర్లలో నమోదైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా దేవదాయశాఖ అధికారి పులి నారాయణమూర్తి సూచించారు. కాకినాడలోని జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో గురువారం కాకినాడ డివిజన్‌లోని ఈఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. దేవదాయశాఖ పరిధిలో ఏయే గ్రామాల్లో ఎంత భూమి ఉంది, ప్రస్తుతం ఆయా గ్రామాల్లో జగనన్న భూసర్వే పూర్తయితే దేవదాయశాఖకు చెందిన భూమిలో ఏమైనా తేడాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దేవదాయశాఖ రికార్డులు ప్రకారమే భూమి ఉండాలని తక్కువ వస్తే ఆయా మండలాల్లోని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇప్పటి వరకూ సర్వే పూర్తికాని గ్రామాల్లో ఎప్పుడు సర్వే జరిగినా ఆయా ఈఓలు పాల్గొనాలన్నారు. భూ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉంటే కాకినాడ ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, జిల్లా దేవదాయశాఖ కార్యాలయ సూపరింటెంటెంట్ సుబ్బారావు , ఈఓలు పాల్గొన్నారు.

ఆస్తి విలువ పెరిగేలా ఆమె స్థలానికి రోడ్డు

- ఆరుద్రకు అన్ని విధాలా సహకరిస్తాం
- మున్సిపల్ కమిషనర్ నాయుడు



ఆరుద్ర స్థలానికి మున్సిపాలిటీ వేస్తున్న రోడ్డు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద గతంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న అమలాపురానికి చెందిన రాజులపూడి ఆరుద్ర అనే మహిళ సమస్య పరిష్కరించేందుకు సహకరిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు గురువారం తెలిపారు. పట్టణంలోని గొల్లగూడెంలో ఆమెకు ఉన్న స్థలం అమ్మకం విషయంలో సహకరించమని కలెక్టర్ శుక్లా.. కమిషనర్ నాయుడు, తహసీల్దార్ శ్రీపల్లవిని ఆదేశించారు. స్థలాన్ని అమ్మేందుకు కొనుగోలుదారులతో కూడా అధికారులు మాట్లాడారు. ఆమె ఇంటికి కమిషనర్, తహసీల్దార్ స్వయంగా వెళ్లి ఆమెతో స్థలం అమ్మకం గురించి చర్చించారు. ఆమె కుమార్తె అనారోగ్యానికి చికిత్స ఖర్చుల కోసం ఇబ్బంది పడుతోంది. ఆమె పరిస్థితిని కళ్లారా చూసిన అధికారులు ఉమ్మడి ఆస్తిలోని స్థలాన్ని గుర్తించారు. ఆ స్థలానికి ఆస్తి విలువ పెంచేందుకు ప్రభుత్వ ఖర్చులతో అక్కడ రోడ్డు నిర్మాణానికి బుధవారం చర్యలు చేపట్టినట్లు కమిషనర్ నాయుడు తెలిపారు. రోడ్డు నిర్మాణం వల్ల ఆ స్థలానికి మంచి ధర పలికేలా అవకాశం వచ్చిందన్నారు. స్థలం అమ్మే వరకూ ఆమెకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పూర్తిగా సహకరిస్తామని కమిషనర్ చెప్పారు.

ఆడబిడ్డా.. అయితే అబార్షనే!?



- గోప్యంగా లింగ నిర్ధారణ పరీక్షలు
- కత్తులు దూస్తున్న కొందరు వైద్యులు
- కట్టడికి వైద్య,ఆర్యోగ శాఖ శ్రీకారం
- 'డెకాయ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- పది ప్రత్యేక బృందాలతో తనిఖీలకు సన్నద్ధం
- లింగ నిర్ధారణ చేసినట్లయితే కఠిన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా 135 స్కానింగ్ సెంటర్లు

డెకాయి ఆపరేషన్ ప్రారంభిస్తాం



లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం. అందుకు పాల్పడిన స్కానింగ్ కేంద్రాలను మూసివేస్తాం. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. డెకాయి ఆపరేషన్లకు సిద్ధం అవుతున్నాం. మార్చి నెలలో **పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు ప్రత్యేక బృందాలను సైతం నియమించాం.**

- కె.వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ

సాక్షి, రాజమహేంద్రవరం: ఆడబిడ్డకు **అమ్మ కడుపులో** రక్షణ కరవవుతోంది.. అబార్షన్ రూపంలో చావు వెంటాడుతోంది.. చిన్నారికి కాపాడేందుకు ప్రభుత్వం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా గర్భస్థ పిండ నాశనం కొనసాగుతూనే ఉంది. కొందరు వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు కాసుల కక్కుర్తి పరాకాష్టకు చేరింది. గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడబిడ్డ అని నిర్ధారణ అయితే అభం శుభం ఎరగని పిండాన్ని తల్లి కడుపులోనే చిదిమేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెరసి భ్రూణ హత్యలు పెరిగిపోతున్నాయి. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయో వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటిని అరికట్టేందుకు ప్రతి మూడు నెలలకోసారి 'డెకాయ్' ఆపరేషన్ పేరు తో స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖకు ఆదేశాలున్నాయి. ఈ మేరకు జిల్లాలో డెకాయ్ నిర్వహించేందుకు వైద్యాధికారులు సన్నద్ధం అవుతున్నారు.

డెకాయి ఆపరేషన్ అంటే..

భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు కేంద్రం 1994లో ప్రీ కన్స్‌ప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్(పీసీపీఎన్‌డీటీ) యాక్ట్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. చట్టం ప్రకారం స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులు లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చేయడం నేరం . జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్కానింగ్ సెంటర్లను, ఆస్పత్రులను మూడు నెలలకోసారి పర్యవేక్షించాలి. డెకాయి ఆపరేషన్ల పేరిట ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. గర్భిణికి లింగ నిర్ధారణ చేస్తున్నప్పుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారు.

జిల్లాలో ఇలా..

- జిల్లా వ్యాప్తంగా 135 స్కానింగ్ సెంటర్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. అనధికారికంగా మరో 200లకు పైగా నడుపుతున్నట్లు సమాచారం.
- స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం కొన్ని విధివిధానాలు వెలువరించింది.
- స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులు విధిగా జిల్లా వైద్యశాఖ వద్ద అనుమతి పత్రం తీసుకోవాలి.
- ఐదేళ్లకోసారి లైసెన్సును రెన్యూవల్ చేసుకోవాలి.
- పీజీ చేసిన వైద్యులు, గైనకాలజిస్టులు, రేడియోలజిస్టులు, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ మాత్రమే స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ చేసినా, భ్రూణ హత్యలు చేసినా స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేయడంతో పాటు వైద్యుల్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించాలి.
- నేరం రుజువైతే మూడేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించవచ్చని చట్టం చెబుతోంది.
- కొన్ని కేంద్రాల్లో ఇవేమీ పట్టడం లేదు. తనిఖీలకు వచ్చే వైద్యాధికారులకు అమ్యామ్యాలు ముట్టజెప్పి తంతు కానిచ్చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అరికట్టేందుకు చర్యలు

లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు అరికట్టేందుకు కలెక్టర్ మాధవీలత నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. పది ప్రత్యేక బృందాలతో 'డెకాయి' అపరేషన్‌కు సన్నద్ధం అవుతోంది. ఇందులో వైద్య, పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం భాగస్వామ్యం కానున్నారు. మార్చి 8వ తేదీ లోగా ఆపరేషన్ పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. సెక్స్ రేషియో 600 కంటే తక్కువ ఉన్న మండలాల జాబితాను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ఆ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

పుట్టగొడుగుల్లా స్కానింగ్ సెంటర్లు

జిల్లాలో స్కానింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రాజమహేంద్రవరంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. **చట్టానికి లోబడి పరీక్షలు చేయాల్సి ఉండగా.. అవేమీ పట్టనట్లు వ్యవ**హరిస్తున్నారు. కొంత మంది తల్లిదండ్రులకు మగ పిల్లలపై ఎక్కువ మక్కువ ఉండటం, తొలుత వారసుడే జన్మించాలన్న కోరికలతో ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నారు. మరి కొందరు ఆడబిడ్డ అయితే భవిష్యత్తులో కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భావనతో లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇక్కడే కాదు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల అమాయకత్వం, ఆర్థిక స్థోమతను ఆసరాగా చేసుకుని లింగ నిర్ధారణ పేరుతో రూ.వేలకు వేలు గుంజుతున్నారు.

పక్కకు ఫాం 'ఎఫ్'..!

గర్భ నిర్ధారణ పరీక్షల కోసం వచ్చే వారి వివరాలను ఫారం-ఎఫ్‌లో పొందుపర్చాలి. గర్భంతో ఉన్న మహిళ పేరు, ఏ వైద్యుడు రిఫర్ చేశాడు, ప్రస్తుం ఆమెకు ఎన్నో గర్భం, ఇంతకు ముందు ప్రసవాల్లో మగ పిల్లలు ఎంతమంది, ఆడపిల్లలు ఎంత మంది, ఎవరైనా చనిపోయారా? వంటి 19 రకాల వివరాలను ఫారంలో నింపాలి. దాన్ని వైద్య ఆరోగ్య శాఖ, స్కానింగ్ సెంటర్, ఆస్పత్రులకు పంపించాలి. గర్భిణుల సమగ్ర సమాచారం బహిర్గతమవుతంది. కానీ జిల్లాలో ఇలాంటి ప్రక్రియ ఎక్కడా నడవడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది.

రత్నగిరికి భక్తుల తాకిడి

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవదంపతులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుని సన్నిధిలో బుధవారం రాత్రి 50 వివాహాలు జరిగాయి. ఈ నవదంపతులతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు బంధుమిత్రులతో కలసి సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి సాధారణ భక్తులు తోడవడంతో సత్యదేవుని ఆలయంలో రద్దీ నెలకొంది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. సత్యదేవుడిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

నేటి నుంచి మూడు రోజులు రద్దీ

రత్నగిరిపై గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. దీంతో శుక్రవారం పెద్ద సంఖ్యలో నవదంపతులు, వారి బంధుమిత్రులు సత్యదేవుని దర్శనానికి తరలివస్తారు. అలాగే శని, ఆదివారాల్లో కూడా దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సర్వే ప్రక్రియకు సమగ్ర కార్యాచరణ



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న భూరక్ష, భూహక్కు పథకం కింద జిల్లాలో చేపడుతున్న సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, కమిషనర్ సిద్ధార్థ జైన్ గురువారం కలెక్టర్ మాధవీలత, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర భూసర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 269 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 231 గ్రామాల్లో గ్రౌండ్ కంట్రోలింగ్ పాయింట్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలిన 38 గ్రామాల్లో పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. చెక్ పాయింట్లకు సంబంధించి 94 గ్రామాల్లో పనులు, 160 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేసినట్లు వివరించారు. గ్రౌండ్ ట్రూథింగ్‌కి సంబంధించి రెండోదశలో 12 గ్రామాల్లో పనులు పూర్తి చేశామని, 4 గ్రామాల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలోని 44 గ్రామాలకు 72,485 సర్వేరాళ్లు సరఫరా చేయాల్సి ఉండగా 33,946 అందాయని, వాటిలో 26,273 ఏర్పాటు చేశామన్నారు. భూరికార్డుల ప్రక్షాళన కోసం జిల్లాలోని 272 గ్రామ పంచాయతీలకు గాను 208 పనులు చేపట్టి 92 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. మ్యూటేషన్‌కు సంబంధించి 16,102 రికార్డులను సరిచేసినట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, ఏ.చైత్రవర్షిణి, ఏడీ సర్వే అధికారి పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

శివార్లకు సాగునీరు : ఆర్డీఓ ముక్కంటి

అంబాజీపేట: శివారు ప్రాంత భూములకు సాగు నీరు అందించే చర్యలు తీసుకుంటామని, అందుకు రైతులు సహకరించాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి అన్నారు. 180 ఎకరాలకు సాగునీరు అందడం లేదని, స్పందనలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మాచవరం, ముంగండలలో వరి చేలను ఆర్డీఓ గురువారం పరిశీలించి రైతులతో చర్చించారు. ప్రస్తుత వంతులవారీ విధానం సమయాన్ని రెట్టింపు చేస్తేనే పంట పొలాలు తడుస్తాయని ఆర్డీవోకు రైతులు వివరించారు. తక్షణమే సాగు నీరు ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరారు. దీనిపై ఆర్డీఓ ముక్కంటి, ఇరిగేషన్ ఏఈ డీ.ఎస్.సుందరసింగ్ మాట్లాడుతూ ఇంజన్ల ద్వారా నీటిని తోడుకునేందుకు ఎకరానికి ఆరు తడులకు సంబంధించి నగదును రైతులకు అందజేస్తామన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి రైతులకు నగదును అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శివారు ప్రాంతాలకు సాగు నీరు వచ్చేలా పంట కాలువలను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుబంధ పోస్టుల భర్తీకి చర్యలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని మహిళలు, పిల్లల సమగ్ర ఆరోగ్య పరిరక్షణ, సుస్థిర లక్ష్యాల కోసం స్త్రీ,శిశు సంక్షేమశాఖకు చెందిన అనుబంధ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పౌరసేవలు, జీజీఎంపీ పనులు, మహిళా,స్త్రీ సంక్షేమం తదితర అంశాలపై అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లా ప్రగతిపై కలెక్టర్ మాధవీలత వివరాలు తెలియజేస్తూ 13 అంగన్‌వాడీ కార్యకర్తలు, 14 సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 8,571 మంది పైగా గర్భిణులు ఉండగా, వారిలో రక్తహీనత ఉన్న 1,645 మందిని గుర్తించామని, వారిలో ప్రభుత్వ పరంగా సేవలు పొందేందుకు 1,634 మంది సంసిద్ధత వ్యక్తం చేశారన్నారు. వారికి ప్రభుత్వం పరంగా అవసరమైన ఆహారం, మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. తక్కువ బరువు ఉన్న పిల్లలు 3,281 మందికి పౌష్టకాహారం అందిస్తున్నామన్నారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఆరేళ్ల పిల్లలు 96,704 మంది ఉండగా, వారిలో 51,857 మంది ఆధార్ నవీకరణ చేశామన్నారు. పౌర సేవలకు సంబంధించి పెన్షన్ కానుకకు 566, ఇంటి స్థలాలకు 20, రేషన్ కార్డులకు 1,789, సమీకృత ధ్రువపత్రాలకు 2,112, ఆదాయ ధ్రువపత్రాలకు 1,488, మ్యూటేషన్‌కు 786 దరఖాస్తులు రాగా అన్ని పరిశీలన దశలో ఉన్నాయన్నారు.

మాక్ డ్రిల్లు.. గుండెఝల్లు

- కోరమాండల్ కర్మాగారంలో అమ్మోనియా లీకైతే?
- ఆగమేఘాలపై నియంత్రణ చర్యలు
- పునరావాస కేంద్రానికి జనాల తరలింపు
- ఉదయం 8.30 నుంచి 11.30 వరకు నిర్వహణ



అమ్మోనియా లీకేజీ వద్ద వాటరింగ్

కాకినాడ రూరల్: వలసపాకల వద్ద గల కోరమాండల్ కర్మాగారంలో అమ్మోనియా గ్యాస్ లీకైతే ఏర్పడే భయానక పరిస్థితిని ఎలా ఎదుర్కొంటుందో మాక్ డ్రిల్ ద్వారా డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ కళ్లకు కట్టింది. ఒళ్లు గగుర్పొడిచే ఆ వాతావరణాన్ని సృష్టించి, ప్రమాదాన్ని నివారించే తీరును గురువారం ప్రదర్శించింది.

మాక్ డ్రిల్ విజయవంతం : కలెక్టర్ కృతికా శుక్లా

కోరమాండల్ కర్మాగారంలో ఎన్‌డీఎంఏ, ఎస్‌డీఎంఏ మార్గదర్శకాలకు అనుగుణంగా మాక్‌డ్రిల్ విజయవంతంగా నిర్వహించామని కలెక్టరు కృతికా శుక్లా తెలిపారు. మాక్ డ్రిల్ అనంతరం ఆమె కోరమాండల్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ మాక్ డ్రిల్‌ను విపత్తు నిర్వహణ, ఫ్యాక్టరీస్, రెవెన్యూ, పోలీస్, కాలు ష్య నియంత్రణ, పురపాలక, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక అధికార విభాగాల అధికారుల సమన్వయంతో నిర్వహించామన్నా రు. కోరమాండల్‌లో కంపెనీ కార్యకలాపాల కోసం నాలుగు ట్యాంకుల్లో 24వేల మెట్రిక్ టన్నుల అమ్మోనియా నిల్వ ఉందన్నారు. ఒక వేళ ప్రమాదవశాత్తు లీకైతే యుద్ధ ప్రాతిపాదికన తీసుకోవల్సిన చర్యలపై డ్రిల్ నిర్వహించామన్నారు. కాకినాడ జిల్లా పరిధిలో ప్రమాదభరితమైన కంపెనీలు ఉన్నాయని వీటి లో మార్చి నెలాఖరు నాటికి మాక్ డ్రిల్ పూర్తి చేయిస్తామన్నారు. తద్వారా వాస్తవంగా ప్రమాదం జరిగితే ఎదుర్కొనే సత్తా లభి స్తుందన్నారు. జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, ఆర్డీఓ రమణ, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ జహీద్ ఖాన్, ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మొహమ్మద్ ఇ స్లాం, ప్లాంట్ మేనేజర్ శ్రీనివాసరావు, డీఎస్‌ఓ సురేంద్ర ఆనంద్, డీపీఆర్‌ఓ పి.రవి, డీఎం అండ్ హెచ్‌ఓ శాంతి ప్రభ, తహసీల్దార్ మురార్జీ, అగ్ని మాపక అధికారి ఏసుబాబు పాల్గొన్నారు.



ఫిషింగ్ హార్బర్‌పేట నుంచి పునరావాసానికి తరలింపు



మాక్ డ్రిల్ పూర్తయ్యాక కోరమాండల్‌లో మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

మాక్ డ్రిల్‌లో గుర్తించిన లోపాలు

- నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ నియమించిన స్వతంత్ర పరిశీలకులు మాక్ డ్రిల్ పలు లోపాలను గుర్తించారు.
- అమ్మోనియా గ్యాస్ లీకేజీ నియంత్రణలో భాగంగా ఆఫ్ సైట్, ఆన్‌సైట్‌లో ప్రజలను అప్రమత్తం చేసేలా అలారం పని చేయలేదు.
- ప్రమాదం జరిగినప్పుడు కోరమాండల్ వద్ద రోడ్డుపై రాకపోకలు నియంత్రించలేదు.
- గ్యాస్ నియంత్రణలో ఎన్డీఆర్ఎఫ్ ఒక టీమ్‌కు మాత్రమే పరిమితమైంది.
- ఉదయం 9గంటలకు కలెక్టర్ యమర్జెన్సీ కాల్‌కు రెస్పాండ్ కాలేదు. తరువాత కాల్‌కు ఆర్డీఓ స్పందించారు.
- ప్రమాదం జరిగిన తరువాత లెవెల్ 3 సైరన్ మోగలేదు.

ప్రమాదాన్ని ఎదుర్కొన్నారిలా..

- కోరమాండల్ కర్మాగారంలో ఉదయం 8.30 గంటలకు అమ్మోనియా వాయువు లీక్
- 8.30 నుంచి ఉదయం 9గంటల వరకు లీకేజీని అరికట్టేందుకు సిబ్బంది విఫలయత్నం
- 9.00 గంటలకు కలెక్టర్, అధికారులకు సమాచారం చేరవేత. వెంటనే విపత్తుల నియంత్రణ శాఖ అధికారుల అప్రమత్తత
- 9.15గంటల నుంచి 9.30 మధ్య కోరమాండల్ వద్దకు ఆర్డీఓ రమణ, పోలీసు సిబ్బంది, డీఎం అండ్ హెచ్‌ఓ, అగ్నిమాపక సిబ్బంది, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ శాఖ అధికారుల చేరిక.
- 9.30 నుంచి 10 గంటల వరకు అమ్మోనియా లీకేజీ అరికట్టేందుకు యంత్రాంగం ప్రయత్నం. అమ్మోనియా లీకేజీతో గాఢత ప్రభావం కర్మాగారం కింద ప్రాంతమైన ఫిషింగ్ హార్బర్‌పేటపై పడుతున్నట్టు గుర్తించి అక్కడ నుంచి 220 మంది వాకలపూడి బీసీ కమ్యూనిటీ హాలు వద్దకు తరలింపు
- 10.30 గంటలకు ప్రమాద స్థలానికి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ టీమ్. కర్మాగారం సిబ్బందితో కలిసి ట్యాంక్ అవుట్‌లెట్ వాల్వ్, పంప్‌ను వేరు చేసి లీకేజీకి అరికట్టారు.
- 11 గంటలకు కలెక్టర్ కృతికా శుక్లా ఆల్ క్లియర్ సిగ్నల్ ఇచ్చారు.
- 11.30 గంటలకు అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

లోకేష్ పాదయాత్ర జబర్దస్తను మించిపోయింది

మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ



తుని: జననేత జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేస్తే ఊరువాడా, పిల్లలు, పెద్దలు, మహిళలు అందరూ తరలివచ్చి నీరాజనం పడితే, నారా లోకేష్ పాదయాత్ర జబర్దస్త్ కామెడీ షోను మించిపోయిందని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ అన్నారు. ఎస్.అన్నవరంలోని మంత్రి రాజా క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడి తనయుడు నారా లోకేష్ రాజకీయ వారసుడు అవుతాడని టీడీపీ భావించిందని, ఇందుకు భిన్నంగా లోకేష్ మంచి కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. గతంలో జబర్దస్త్ షో టీవీలో వస్తుంటే అందరూ సరదా కోసం చూసేవారని, ఇప్పుడు లోకేష్ పాదయాత్ర దానిని మించి పోయిందన్నారు. ప్రజలకు మేం అధికారంలోకి వస్తే ఇది చేస్తామని చెప్పకుండా జోకర్ మాదిరిగా వ్యవహరించడం రాజకీయ పరిజ్ఞానం లేదని చెప్పడానికి నిదర్శనమన్నారు. నందమూరి తారకరత్నను పాదయాత్రకు ఆహ్వానించారని, ఆయన గుండెపోటుకు గురై ఆసుపత్రి పాలైనా పట్టించుకోని మనస్తత్వం లోకేష్‌దన్నారు. టీవీలో జనం చూసే రోజులు పోయానని ప్రతి అంశం సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో నిజాలు అందరికీ తేటతెల్లం అవుతున్నాయన్నారు. టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వంగలపూడి అనిత వైఎస్సార్ సీపీ దళిత మంత్రులపై విమర్శలు చేస్తే టీడీపీ అధికారంలోకి వస్తే తనకు హోంమంత్రి పదవి ఇస్తారని ఆశ పెట్టుకుందన్నారు. నువ్వు ఎంతగా ప్రయత్నించినా హోంమంత్రి కావలేవన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను ప్రేమతో చూసిన మనస్సు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదని, అందుకే ఎమ్మెల్సీ స్థానాల్లో అగ్రస్థానం కల్పించారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి మళ్లీ ప్రభుత్వానికే అమ్మారన్నారు. ప్రజలు మెచ్చిన పాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో 175 స్థానాలను కైవసం చేసుకుంటారని జోస్యం చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగ్గురు నామినేషన్లు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికకు సంబంధించి గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో నామినేషన్ల సంఖ్య నాలుగుకు చేరింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కుడుపూడి సూర్యనారాయణరావు నామినేషన్ ఇప్పటికే దాఖలు చేయగా గురువారం టీడీపీ తరపున కడలి సాయిదుర్గ నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అంబటి కోటేశ్వరరావు, ఇంత సంతోషం నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల స్క్రూటీని నిర్వహించనున్నారు.

‘ఈనాడు’ రాతలపై ఆగ్రహ జ్వాలలు



సీతంపేటలో ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్, నాయకులు



ఆదుర్రులో ఈనాడు ప్రతులను కాల్చి వేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, పార్టీ శ్రేణులు



శంఖవరంలో ఈనాడు పత్రికలను తగులబెడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, కార్యకర్తలు

- జర్నలిజం విలువలకు తిలోదకాలిస్తోందంటూ నిరసన
- వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో పత్రిక ప్రతుల దహనం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపైనా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైనా తప్పుడు రాతలు రాస్తున్నారంటూ ‘ఈనాడు’ దినపత్రిక ప్రతులను వైఎస్సార్ సీపీ నేతలు దహనం చేశారు. రాజమహేంద్రవరంలోని సీతంపేటలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ నేతృత్వంలో ఈ నిరసన సాగింది. జర్నలిజం విలువలకు తిలోదకాలిస్తూ నవ్వులపాలయ్యేలా ఈనాడు యాజమాన్యం వ్యవహరిస్తోందని వారు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, గుర్రం గౌతమ్, మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి, డాక్టర్ అనుసూరి పద్మలత, అరిగెల బాబు, కట్టా వెంకటేష్, సుంకర అంజిబాబు, సాయి బాబా, గణేష్ పాల్గొన్నారు.

కట్టుకథలను నిరసిస్తూ...

మామిడికుదురు: వైఎస్సార్ సీపీపైన, ఆ పార్టీకి చెందిన నాయకులపైన కట్టుకథలు రాస్తున్న ఈనాడు వైఖరిని నిరసిస్తూ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గురువారం ఆదుర్రులో ఈనాడు ప్రతులను దహనం చేశారు. గ్రామ పంచాయతీకి సమీపంలో ప్రధాన రహదారిపై ఈనాడు వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.

టీడీపీ నేత పట్టాభికి సంబంధించిన పాత ఫొటోలను ప్రచురించి ప్రజలను తప్పుదారి పట్టించడం ఈనాడు దిగజారుడు తనానికి నిదర్శనమని ఎమ్మెల్యే చిట్టిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈనాడు తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో పార్టీ నేతలు కొమ్ముల రాము, గెద్దం మహాలక్ష్మమ్మ, కుసుమ శ్రీధర్, జక్కంపూడి వాసు, పితాని సురేంద్ర, కాంద్రేగుల బాబి, కుడుపూడి రామారావు, నాగాబత్తుల శ్రీకృష్ణ, గనిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

శంఖవరంలో..

శంఖవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే ఈనాడు పత్రిక కట్టుకథలు అల్లుతోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో ఎమ్మెల్యే కార్యకర్తలతో కలసి గురువారం ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షానికి కొమ్ముకాసే ఈనాడు పత్రిక రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లుతోందన్నారు. పట్టాభిని కొట్టారంటూ ఈనాడులో ప్రచురించి అభాసుపాలయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. రెండేళ్ల కిందటి ఫొటోలతో తప్పుడు కథనాన్ని ప్రచురించడంపై సోషల్ మీడియాల్లో కూడా ఉతికి ఆరేశారన్నారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడానికి, వైఎస్సార్ సీపీని దెబ్బతీయడానికి తప్పుడు కథనాలు ప్రచురించే స్థాయికి ఈనాడు దిగజారిపోవడం సిగ్గు చేటన్నారు. పట్టాభిపై దాడి జరగనప్పటికీ ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తారా అంటూ మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు, నా భర్త ప్రాణాలకు ముప్పు ఉందంటూ పట్టాభి భార్య చందన వాపోతున్నట్టు మరో వార్తనూ....ఇలా తప్పుడు వార్తలు ప్రచురించి పాఠకులను తప్పుదోవ పట్టించిందని ఈనాడు తీరును విమర్శించారు. 18 ఎమ్మెల్సీ స్థానాలకు 11 బీసీలకు కేటాయించడంతో వైఎస్సార్ సీపీకి దేశవ్యాప్తంగా వస్తున్న ప్రశంసలను చూసి ఓర్వలేక టీడీపీ ఈ ఘనకార్యానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెమీస్ దశలో జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న జాతీయ వుమెన్ సీనియర్స్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు గురువారం సెమీస్ దశకు చేరుకున్నాయి. మొదటి క్వార్టర్ ఫైనల్స్‌లో ఒడిశా, మహారాష్ట్ర జట్లు పోటీ పడ్డాయి. ట్రై బేకర్ కాగా పెనాల్టీ షూట్స్‌లో రెండు జట్లు చెరో మూడు గోల్స్ చేశాయి. మరో అవకాశం ఇవ్వగా మహారాష్ట్ర గోల్ చేయగా, ఒడిశా చేయలేకపోయింది. దీంతో మహారాష్ట్రను విజేతగా నిర్ణయించారు. రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్, కర్నాటక జట్లు పోటీ పడ్డాయి. మధ్యప్రదేశ్ 6–0 స్కోర్‌తో గెలిచింది. మూడో మ్యాచ్‌లో జార్ఖండ్, పంజాబ్ జట్లు తలపడ్డాయి. జార్ఖండ్ 2–0 స్కోర్ తేడాతో విజయం సొంతం చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో హర్యానా, బెంగాల్ జట్లు పోటీ పడ్డాయి. 5–0 స్కోర్‌తో హర్యానా గెలిచింది. గురువారం జరిగిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కోశాధికారి పీటర్, టోర్నమెంట్ కో–ఆర్డినేటర్ వి.రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ శుక్రవారం హర్యానా–మహారాష్ట్ర మధ్య మొదటి సెమీఫైనల్స్, జార్ఖండ్–మధ్యప్రదేశ్ మధ్య రెండో సెమీఫైనల్స్ జరుగుతాయని తెలిపారు.



ఒడిశా- మహారాష్ట్ర జట్ల మధ్య సాగిన మ్యాచ్

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి 27 వరకు అవకాశం

రాయవరం: పదో తరగతి చదివి, ఇంటర్మీడియెట్‌లో చేరకుండా ఉన్న వారికి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశముందని ఇంటర్మీడియెట్ బోర్డు డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా అవకాశం కల్పిస్తున్నామన్నారు. దగ్గర్లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు.

అదనపు సబ్జెక్టుకు రూ.200
టీవోసీ ఫర్ ప్రతీ సబ్జెక్టుకు రూ.200
పరీక్ష ఫీజు:
ఎగ్జామినేషన్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5 ప్రతీ సబ్జెక్టుకు ఎగ్జామినేషన్ ఫీజు రూ.145 ప్రతీ సబ్జెక్టుకు, ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5 ప్రతీ సబ్జెక్టుకు, ప్రాక్టికల్ ఫీజు రూ.95 ప్రతీ సబ్జెక్టుకు.

ఫీజులు ఇలా..

వివరం	జనరల్	కన్సెషన్ కేటగిరీలు
రిజిస్ట్రేషన్ ఫీజు	రూ.200	రూ.200
అడ్మిషన్ ఫీజు		
ఐదు సబ్జెక్టులకు	రూ.1,400	రూ.1,100
మైగ్రేషన్ కమ్ టీసీ	రూ.200	రూ.200
లేట్ ఫీజు	రూ.500	రూ.500
మొత్తం	రూ.2,300	రూ.2000

క్రైం కార్నర్..

బ్రిడ్జి రెయిలింగ్‌కు ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అల్లవరం: మలికిపురం మండలం గూడపల్లి గ్రామానికి చెందిన దూది నాగశంకరగణేష్ (32) బోడసకుర్రు–పాశర్లపూడి బ్రిడ్జి రెయిలింగ్‌కు బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం లిక్కర్ గొడాములో ప్రైవేటు ఏజెన్సీ అయిన సీటెల్‌లో ఎగ్జిక్యూటీవ్‌గా నాలుగేళ్లగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకుని ఓ థియేటర్‌లో ఫస్ట్ షో సినిమా చూశాడు. అక్కడి నుంచి తన మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తూ రాత్రి పది గంటల సమయంలో బోడసకుర్రు తొమ్మిదో పిల్లర్ వద్ద రెయిలింగ్‌కు, మెడకు భారీ తాడు కట్టుకుని ఒక్కసారిగా దూకేశాడు. మృతుడి మెడ దాదాపుగా కట్ అయి, శరీరం వేలాడుతూ వైనతేయ నదిలో నీటిని తాకుతూ ఉంది. ఉరి వేసుకున్న తీరును బట్టి మృతుడి పై నుంచి దూకేశాడని పోలీసులు నిర్ధారించారు. బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి శవం వేలాడుతూ ఉండడాన్ని గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మత్స్యకారుల సహకారంతో పడవలో వేసుకుని పోలీసులు, మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చారు. సీఐ వీరబాబు, ఎస్సై శ్రీనునాయక్‌లు మృతదేహాన్ని పరిశీలించి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు పశ్చిమగోదావరి జిల్లా తూర్పు విప్రర్రు గ్రామానికి చెందిన యువతిని రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు.

వీరికి ఒక బాబు పుట్టాడు. రెండు రోజుల క్రితమే మృతుడి భార్య తన బాబుతో ఇంటికి వచ్చింది. ఇంతలో గణేష్ ఆత్మహత్యకు చేసుకోవడంపై కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

కత్తితో దాడి

హత్యాయత్నం కేసు నమోదు

పెదపూడి: సెల్‌ఫోన్ నుంచి అసభ్య ఫొటోలు తీస్తున్నావా అని అడగటానికి వెళ్లిన ముగ్గురిపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఒకరికి స్వల్ప గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై పి.వాసు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామేశ్వరం గ్రామం శివారు కొత్తురు ఇందిరమ్మకాలనీలో ఆర్.రాజు, అతని భార్య ఆర్.ఎస్.వేణి ఉంటున్నారు. మూడురోజుల క్రితం సత్యవేణి స్నానానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లి వస్తుండగా వారి ఇంటికి సమీపంలో ఉంటున్న సీహెచ్ సుభాష్ మొబైల్ పట్టుకుని మేడపై ఉన్నాడు. అతని అసభ్య ఫొటోలు తీస్తున్నాడని భావించిన ఆర్.ఎస్.వేణి భర్త, బంధువులకు విషయం తెలియజేసింది.

దీంతో ఆర్.రాజు, అతని బంధువు దుర్గాప్రసాద్, వేణు ఈ నెల 22వ తేదీ రాత్రి సుభాష్‌ను నిలదీశారు. మేడపై ఉండి అసభ్య వీడియోలు తీస్తున్నావా, ఆ మొబైల్‌లో ఉన్నది వెంటనే డిలిట్ చేయి అని అడుగుతుండగా సుభాష్ వారిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయపడిన దుర్గాప్రసాద్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాలికను తల్లిని చేసిన యువకుడిపై కేసు

నిడదవోలు రూరల్: బాలికను ప్రేమించానని నమ్మించి గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. తాడిమళ్ల గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ ప్రత్తి కిరణ్ ప్రేమించానని నమ్మించి, మోసం చేశాడు. నిడదవోలులోని ఒక ప్రైవేటు కళాశాలలో చదువుతున్న బాలిక యథావిధిగా గురువారం తరగతులకు హాజరైంది. బాత్రూమ్‌కు వెళ్లిన సమయంలో ఆమె ప్రసవించింది. వెంటనే బాలికను నిడదవోలులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలికతో పాటు పుట్టిన ఆడశిశువు కూడా క్షేమంగా ఉంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

రూ.1.43 లక్షల విలువైన 18 సెల్‌ఫోన్లు రికవరీ

రాజమహేంద్రవరం సిటీ: రైల్వేస్టేషన్లలో సెల్‌ఫోన్లు చోరీ చేసిన యువకుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 18 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్టు రాజమహేంద్రవరం ఐఆర్‌పీ ఎస్ఐ కె.మావుళ్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు రాజమహేంద్రవరం డీఎస్ఆర్‌పీ బీవీఎస్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పి.విజయ్ శంకర్ పర్యవేక్షణలో ఆర్‌పీ ఎస్ఐ పి.లోవరాజు, సిబ్బంది, రాజమహేంద్రవరం ఆర్‌పీఎఫ్ సిబ్బంది సెల్‌ఫోన్లు దొంగిలించిన మందపాటి వెంకటేష్ అలియాస్ వెంకట్‌ను గురువారం గోదావరి రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు.

కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెంనకు చెందిన వెంకట్ ప్రస్తుతం గోకవరంలో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నట్టు చెప్పారు. అతని వద్ద నుంచి 18 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.లక్షా 43వేలు ఉంటుందని చెప్పారు. నిందితుడిని విజయవాడ రైల్వే మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచనున్నట్టు తెలిపారు.



సెల్‌ఫోన్లు, నిందితుడు వెంకటేష్‌తో రైల్వే పోలీసులు సైదయ్య, మావుళ్ళు, లోవరాజు సిబ్బంది

ఉరి వేసుకుని వివాహిత మృతి

కొత్తపేట: భర్త మద్యానికి బానిసవడంతో మనస్థాపం చెందిన రుద్ర రాజరాజేశ్వరి (28) ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక ఎస్సై వి.మణికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట మండలం బిళ్లకుర్రు సత్తెమ్మకాలనీకి చెందిన రుద్ర వెంకటనారాయణకు, వాడపాలెం గ్రామానికి చెందిన కుప్పాల శివరామప్రసాద్ కుమార్తె రాజరాజేశ్వరికి ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వెంకటనారాయణ కొబ్బరి లోడు ఎగుమతి పనిచేస్తుంటాడు. అతను తాగుడుకు బానిసయ్యాడు. తాగుడు మానాలని ఎన్నిసార్లు చెప్పినా మానకపోవడంతో తరచూ గొడవలు పడుతున్నారు.

భర్త తీరుపై భార్య రాజేశ్వరి తీవ్ర మనస్థాపం చెంది గురువారం వంటగదిలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పక్క పోర్షన్లో నివాసం ఉంటున్న బంధువులు చూసి భర్తకు సమాచారం ఇచ్చారు. అతనిచ్చిన సమాచారం మేరకు మృతురాలి తండ్రి కుప్పాల శివరామప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై మణికుమార్ తెలిపారు.